క్లుప్తంగా

పంచాయతీ కార్మికుల ముందస్తు అరెస్ట్



పోలీస్ స్టేషన్‌లో పంచాయతీ కార్మికులు

వెల్దుర్తి(తూప్రాన్): డిమాండ్‌ల సాధన కోసం ఇందిరా పార్కులో తలపెట్టిన ధర్నా కార్యక్రమానికి వెళ్లకుండా మండలంలోని గ్రామ పంచాయతీ కార్మికులు, సీఐటీయూ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. సాయంత్రం వరకు పోలీస్ స్టేషన్‌లోనే ఉంచి సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. అక్రమ అరెస్ట్‌లతో ఉద్యమాన్ని ఆపలేరని, మల్టీ పర్పస్ విధానం రద్దు చేయడంతో పాటు కార్మికులందరిని పర్మినెంట్ ఉద్యోగులుగా గుర్తించే వరకు పోరాటం కొనసాగిస్తామని ఈ సందర్భంగా కార్మికులు పేర్కొన్నారు. అరెస్ట్ అయిన వారిలో సీఐటీయూ మండల కార్యదర్శి గౌరి, యాదయ్య, కృష్ణ, యేసు, దుర్గపతి, పెంటయ్య తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న రిలే దీక్షలు



రిలే నిరాహారదీక్షలో పాల్గొన్న రైతులు

నర్సాపూర్: రైతులు చేపట్టిన రిలే నిరాహారదీక్షలు మంగళవారం నాటికి 19వ రోజుకు చేరాయి. మంగళవారం దీక్షలో చెన్నాపూర్, చిన్నచింతకుంట, బ్రాహ్మణపల్లి గ్రామాలకు చెందిన రైతులు నర్సింహారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, శ్రీశైలంయాదవ్, సత్యగౌడ్, రాంకిషన్, మల్లేశం, పోచయ్య, మహేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

సన్మానం



రాములు దంపతులను సన్మానిస్తున్న డీఎఫ్ఓ, అటవీ శాఖ అధికారులు, సిబ్బంది

నర్సాపూర్: పదవి విరమణ పొందనున్న సెక్షన్ ఆఫీసర్ రాములును అటవీ శాఖ అధికారులు మంగళవారం ఘనంగా సన్మానించారు. నర్సాపూర్ అటవీ శాఖ రేంజ్ పరిధిలోని తిరుమలపూర్ సెక్షన్ ఆఫీసర్‌గా పని చేస్తున్న రాములు ఈనెల 31న పదవి విరమణ పొందనున్నారు. కాగా అటవీ రేంజ్ పరిధిలో బదిలీ అయిన అధికారులు బుధవారం తమకు పోస్టింగ్ ఇచ్చిన ప్రాంతాలకు వెళ్లనున్నందున మంగళవారం రాములు దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో డీఎఫ్ఓ రవిప్రసాద్, రేంజ్ అధికారి అంబర్‌సింగ్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మట్టి రవాణాను అడ్డుకోవాలి

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని కోండాపూర్, ముప్పిరెడ్డిపల్లి గ్రామాల్లో అక్రమంగా మట్టి రవాణా చేస్తున్నారని, అడ్డుకోవాలని కొండాపూర్ గ్రామస్తులు మంగళవారం తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. దీంతో రెవెన్యూ అధికారులు కొండాపూర్ గ్రామ శివారులో అక్రమంగా మట్టి రవాణాను అడ్డుకున్నారు. సంఘటన స్థలంలో ఒక టిప్పర్‌ను పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.

శాస్త్రవేత్తల కృషి అభినందనీయం

తూప్రాన్: శాస్త్రవేత్తలు చేస్తున్న కృషి అభినందనీయమని ఆర్డీఓ జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం శ్రీకృషి విజ్ఞాన్ గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఇస్రో శాస్త్రవేత్తల పరిశోధన ప్రయోగాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ఆర్డీఓ జయచంద్రారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ జ్యోతికృష్ణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో సైంటిస్ట్ శ్రీనివాస్, టీఎస్ ప్రసాద్, టెక్నికల్ ఆఫీసర్ సుజేయ్, కృషి విజ్ఞాన్ గ్రామీణ అభివృద్ధి సంస్థ చైర్మన్ లక్ష్మీకాంతం, మున్సిపల్ కమిషనర్ ఖాజా మోహిజొద్దీన్, వైస్ చైర్మన్ శ్రీనివాస్, కౌన్సిలర్లు, నాయకులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్మిక సమస్యలపై చర్చించాలి

మెదక్ కలెక్టరేట్: కార్మిక సమస్యలపై చర్చించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేశం పేర్కొన్నారు. ఆశ వర్కర్లు, గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలపై మంగళవారం చలో హైదరాబాద్ కార్యక్రమానికి సీఐటీయూ ఆధ్వర్యంలో పిలుపునివ్వడంతో నాయకులు మల్లేశం, బస్వరాజ్, నర్సమ్మలను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు.

నాటిన మొక్కలను సంరక్షించాలి

మున్సిపల్ చైర్మన్ జితేందర్‌గౌడ్



రామాయంపేటలో మొక్కలు నాటుతున్న మున్సిపల్ చైర్మన్ జితేందర్‌గౌడ్

రామాయంపేట(మెదక్): వన మహోత్సంలో భాగంగా నాటిన మొక్కలను అందరూ సంరక్షించాలని మున్సిపల్ చైర్మన్ జితేందర్‌గౌడ్ అన్నారు. మంగళవారం రామాయంపేటలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాము నాటిన మొక్కలను సంరక్షిస్తామని, ప్రజలు సహకరించాలని సూచించారు. కాగా వన మహోత్సానికి సంబంధించి బ్యానర్‌పై ప్రొటోకాల్ ప్రకారం ఎమ్మెల్యే, సీఎం, తదితర చిత్రపటాలు లేకపోవడంతో కౌన్సిలర్ దేమె యాదగిరి నిరసన వ్యక్తం చేశారు. మున్సిపల్ కమీషనర్ దేదేందర్, సహకార సంఘం చైర్మన్ బాదె చంద్రం, వైస్ చైర్మన్ పుట్టి విజయలక్ష్మి, కౌన్సిలర్లు గజవాడ నాగరాజు, దేమె యాదగిరి, సుందర్‌సింగ్, కోఆప్షన్ సభ్యుడు అహ్మద్, మేనేజర్ శ్రీనివాస్, నాయకులు చింతల యాదగిరి, రాజు, సరాఫ్ శ్యాం, తదితరులు పాల్గొన్నారు.

మొక్కలే జీవనాధారం

చిలప్‌చెడ్(నర్సాపూర్): మొక్కలే భవిష్యత్ తరాలకు జీవనాధారంగా ఉంటాయని ఎస్‌ఐ షేక్ మహబూబ్ అన్నారు. మంగళవారం ఆయన మండల సోమక్కపేట్ గ్రామస్తులకు మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో పంపిణీ చేసిన మొక్కలు తప్పనిసరిగా నాటి, వాటిని బాధ్యతగా సంరక్షించాలన్నారు. అదే విధంగా పొలాల గట్లపై మొక్కలు నాటేందుకు ఆసక్తి ఉన్న రైతులకు మొక్కలు పంపిణీ చేయాలన్నారు. నాటిన మొక్కలను పాడు చేస్తే, చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ వెంకటేశ్వర్, పంచాయతీ కార్యదర్శి నరేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.



సోమక్కపేట్ గ్రామస్తులకు మొక్కలు పంపిణీ చేస్తున్న ఎస్ఐ షేక్‌మహబూబ్

అసమానతలు పాటిస్తే చర్యలు

మనోహరాబాద్(తూప్రాన్): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశానుసారం ప్రతీ నెల 30న పౌర హక్కుల దినోత్సవంగా ప్రకటించారు. అందులో భాగంగానే మంగళవారం మండలంలోని ఉప్పు పాలాట గ్రామంలో ఎస్ఐ సుభాష్‌గౌడ్, గిర్దావర్ దీక్షిత్ గ్రామస్తులతో సమావేశమై ఎస్సీ, ఎస్టీలకు చట్టంలో కల్పించిన హక్కుల గురించి వివరించారు. అలాగే ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి గాను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న పథకాల గూర్చి, ప్రభుత్వ పథకాల్లో సబ్సిడీ, రాజకీయాల్లో, ఉద్యోగాల్లో రిజర్వేషన్స్ వివరించారు. ఎస్సీ, ఎస్టీలను కులం పేరుతో దూషిస్తే కేసులు తప్పవని హెచ్చరించారు.

ఐకమత్యంతోనే అభివృద్ధి

చిలప్‌చెడ్(నర్సాపూర్): పౌరహక్కులు తెలుసుకోవడం వల్ల ప్రజా సమస్యలు దూరం అవడంతో పాటు, ప్రజల ఐక్యతతో గ్రామ అభివృద్ధి సాధ్యమని ఆర్ఐ వెంకటేశ్వర్ అన్నారు. మంగళవారం మండలంలోని సోమక్కపేట్ గ్రామంలో పౌరహక్కుల సదస్సు నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్ మాట్లాడుతూ.. పౌర హక్కుల్లో ఎలాంటి వివక్షలు ఉండకూడదనే ఉద్దేశ్యంతో ప్రతీ నెల ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ముఖ్యంగా అంటరానితనం, ఆలయాల ప్రవేశం, పౌర సరాఫరాలు, పెన్షన్లు తదితర వివరాలను వారు గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. అదే విదంగా గ్రామస్తుల్లో అర్హులైన వారికి రేషన్ సరుకులు అందుతున్నాయా అని తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎస్ఐ షేక్ మహబూబ్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



చిలప్‌చెడ్(నర్సాపూర్): సోమక్కపేట్‌లో మాట్లాడుతున్న అధికారులు



మనోహరాబాద్(తూప్రాన్): మాట్లాడుతున్న ఎస్ఐ సుభాష్‌గౌడ్

జబ్బులతో జనం పరేషాన్

నర్సాపూర్: వాతావరణంలో మార్పు, వర్షాకాలం సీజన్ కావడం, దోమలు పెరగడం తదితర కారణాలతో పలు రకాల జబ్బులతో ప్రజలు పరేషాన్ అవుతున్నారు. ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి పట్టణంతో పాటు చుట్టు పక్కల మండలాల్లోని పలు గ్రామాల ప్రజలు వైద్యం కోసం వస్తుంటారు. వైరల్ ఫీవర్, మలేరియా, వాంతులు, విరేచనాలు తదితర జబ్బులతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఆస్పత్రికి రోజు సుమారు నాలుగు వందల మంది వరకు అవుట్ పేషెంట్లు వస్తున్నారు. ఆయా వ్యాధులతో వస్తున్న వారిలో అవసరమైన వారిని ఆస్పత్రిలో చేర్చుకొని వైద్యం అందిస్తున్నామని, మామూలు సమస్యతో ఉన్న వారిని అవుట్ పేషెంట్స్‌గా వైద్యం అందిస్తున్నామని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పావని తెలిపారు.



ఆస్పత్రిలో ఓపీ కోసం పేరు నమోదు చేసుకునేందుకు బారులు తీరిన ప్రజలు

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి



చిన్నశంకరంపేటలో పోలీసులు అరెస్ట్ చేసిన ఆశా వర్కర్లు



టేక్మాల్‌లో నిరసన తెలుపుతున్న ఆశా వర్కర్లు

టేక్మాల్(మెదక్): ఆశావర్కర్‌ల సమస్యలను పరిష్కరించాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు భక్తుల వీరప్ప తెలిపారు. చలో హైదరాబాద్ కార్యక్రమానికి వెళ్తున్న ఆశా వర్కర్లను పోలీసులు మంగళవారం ముందస్తుగా అరెస్ట్ చేశారు. బీఆర్ఎస్ నాయకులు మద్దతు తెలిపి మాట్లాడారు. ఇందులో బీఆర్ఎస్ పార్టీ జిల్లా యువత కార్యదర్శి భాస్కర్, నాయకులు సుధాకర్, మహేందర్, సంజీవులు, గోవిందాచారి, బాలకృష్ణ, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

చిన్నశంకరంపేటలో ముందస్తు అరెస్ట్

చిన్నశంకరంపేట(మెదక్): ఆశా వర్కర్ల డిమాండ్ల సాధనకు ఆరోగ్యశాఖ కమిషనరేట్ ముట్టడికి వెళ్లగా పోలీసులు వారిని ముందస్తు అరెస్ట్‌చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. చిన్నశంకరంపేట మండలంలోని 12 మంది ఆశావర్కర్లను పోలీసులు అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అలాగే నార్సింగి మండలంలో 6గురు ఆశా వర్కర్లను ముందస్తుగా అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

కల్యాణలక్ష్మి చెక్కుల అందజేత

మెదక్‌జోన్: ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో హవేళిఘనపూర్‌కు చెందిన 53 మంది లబ్ధిదారులకు మంగళవారం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ అందించారు. కార్యక్రమంలో హవేళి ఘణాపూర్ మండల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

కొల్చారం(నర్సాపూర్): గ్రామంలో నెలకొన్న సమస్యలపై విన్నవించేందుకు మండలంలోని తుక్కాపూర్ గ్రామస్తులు మంగళవారం అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లను కలిసి వినతిపత్రం అందజేస్తున్నట్లు ఓ ప్రకటనలు తెలిపారు. గ్రామంలో పారిశుద్ధ్య పనులు, కార్మికుల జీతాలు, నూతన పంచాయతీ కార్యదర్శి నియామకం పై అదనపు కలెక్టర్‌కు వివరించారు. కార్యక్రమంలోఆంజనేయులు, దత్తు రావు, సతీష్ కుమార్, రవీందర్, యాదగిరి, శ్రీశైలం ఉన్నారు

రుణమాఫీ సద్వినియోగం చేసుకోవాలి

శివ్వంపేట(నర్సాపూర్): ప్రభుత్వం రైతుల కోసం అందించిన రుణమాఫీని సద్వినియోగం చేసుకోవాలని శివ్వంపేట పీఏసీఎస్ చైర్మన్ చింతల వెంకట్‌రామిరెడ్డి అన్నారు. మంగళవారం పీఏసీఎస్ కార్యాలయంలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శివ్వంపేట బ్రాంచ్ పరిధిలో మొదటి విడత లక్ష లోపు రుణమాఫీ 369 మంది రైతులకు సంబంధించి రూ.కోటి 33 లక్షలు, రెండో విడతలో రూ.లక్షయాభై వేలకు సంబంధించి 81 మంది రైతులకు 62 లక్షలు మాఫీ అయినట్లు చెప్పారు. రుణమాఫీ అయిన రైతులందరికీ కొత్త రుణాలు ఇస్తామన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి, ఫీల్డ్ అధికారి కృష్ణారావ్, సీఈఓ మధు, డైరెక్టర్లు యాదగౌడ్, వీరస్వామి, పెంటగౌడ్, భిక్షపతిరెడ్డి, నర్సింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు

మనోహరాబాద్(తూప్రాన్): గ్రామ పంచాయతీ కార్మికుల చలో హైదరాబాద్ నేపథ్యంలో ముందస్తు అరెస్ట్ చేయడం దారుణమని గ్రామ పంచాయతీ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఆసిఫ్ అన్నారు. కార్మికులను ఆందోళనలో పాల్గొనకుండా ఉండేందుకు వారిని వేకువజామునే అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించడం విచారకరమన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల ముందస్తు అరెస్ట్

పాపన్నపేట(మెదక్): సర్వ శిక్ష అభియాన్ ఉద్యోగులకు మినిమం టైమ్ స్కేల్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర కమిటీ మంగళవారం అసెంబ్లీ ముట్టడికి పిలుపు నిచ్చింది. ఈ నేపథ్యంలో పాపన్నపేట మండల సమగ్ర శిక్ష ఉద్యోగులను పాపన్నపేట పోలీసులు తెల్లవారుజామున ముందస్తు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు.

శిథిల పాఠశాల భవనం పరిశీలన



శిథిలావస్థలో ఉన్న గదిని పరిశీలిస్తున్న ఎంఈఓ, ఉపాధ్యాయులు

రామాయంపేట(మెదక్): శిథిల బడిలో అవస్థలు అనే వార్త సాక్షి దినపత్రికలో ప్రచురితమైంది. దీంతో ఈ కథనానికి మంగళవారం మండల విద్యాధికారి నీలకంఠం స్పందించారు. రామాయంపేటలో శిథిలావస్థలో ఉన్న జిల్లా పరిషత్ పాఠశాల భవనాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన శిథిలమై నీరు ఉరుస్తున్న అన్ని గదులను పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. వర్షాలు కురిస్తే భవనం కూలే పరిస్థితిలో ఉందని ఉపాధ్యాయులు ఎంఈవోకు వివరించారు. తాము భయం, భయంగా గదుల్లో కూర్చొని చదువుకుంటున్నామని విద్యార్థులు తెలిపారు. పరిస్థితి తీవ్రతను జిల్లా విద్యాధికారికి, కలెక్టర్‌కు వివరిస్తామని ఎంఈవో చెప్పారు.

పాఠశాలలో పోషణ్ అభియాన్

పాపన్నపేట(మెదక్): పోషన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం పాపన్నపేట ఉన్నత పాఠశాలలో తిథి భోజన్ ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా మల్లంపేట గ్రామానికి చెందిన సాయినాథ్ రావు విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. మధ్యాహ్న భోజనంతో పాటు స్వీట్లు అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం మహేశ్వర్ మాట్లాడుతూ.. పోషణ్ అభియాన్ క్రింద విద్యార్థులకు దాతల సహకారంతో పోషకాహారం అందజేయాలన్నది ప్రభుత్వ లక్ష్యమన్నారు. దాతలు ఎవరైన ఉంటే ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో టీచర్లు వెంకటేశం, నాగరాజు, అనిల్,అంజాగౌడ్, ప్రవీణ్, కృష్ణకాంత్, కిషన్ మోహన్‌రావు, నర్సింలు, నింగప్ప, యాదయ్య పాల్గొన్నారు.

నిజాంపేటలో..

నిజాంపేట(మెదక్): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం నాడు సమీకృత భోజనంను ఏర్పాటు చేశారు. మండల కేంద్రంలోని పలువురి దాతల సాయంతో మధ్యా హ్న భోజనం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జెడ్పీటీసీ పంజా విజయ్ కుమార్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో నరేందర్, జీపీ స్వామి, భరత్, లింగమూర్తి, తదితరులు పాల్గొన్నారు.



నిజాంపేటలో సమీకృత భోజనం ఏర్పాటు చేసిన దాతలు

కష్టపడే విద్యార్థులకు మంచి భవిష్యత్



తునికి విజ్ఞాన జ్యోతిలో వ్యవసాయ విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న సురేష్‌బాబు

- విజ్ఞానజ్యోతి చైర్మన్, ప్రముఖ సినీనిర్మాత సురేష్‌బాబు
- కౌడిపల్లి మండల తునికివద్దగల విజ్ఞానజ్యోతి వ్యవసాయ విద్యార్థులకు సర్టిఫికెట్ల పంపిణీ

కౌడిపల్లి(నర్సాపూర్): కష్టపడే విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉంటుందని విజ్ఞానజ్యోతి విద్యసంస్థ చైర్మన్, ప్రముఖ సినీనిర్మాత సురేష్‌బాబు తెలిపారు. మంగళవారం మండలంలోని తునికి వద్దగల డీఆర్ఎస్‌విజేఐఆర్‌డీ (డాక్టర్ డీ రామానాయుడు విజ్ఞానజ్యోతి గ్రామీణాభివృద్ధి విద్యసంస్థ)లో ఆరునెలల ఉచిత వ్యవసాయ విద్య నేర్చుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి నూజివీడు సీడ్స్ డైరెక్టర్ వెంకటరావు, హెచ్ఎం క్లాస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ గజానంద్ బిరాధర్, కన్వర్ గొగొయి, నాగర్‌కర్నూల్ హార్టికల్చర్ అధికారి చక్రపాణి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సురేష్‌బాబు విజ్ఞానజ్యోతి, నూజివీడు సీడ్స్ సంయుక్తంగా నిర్వహించిన ఆరునెలల వ్యవసాయ విద్య శిక్షణ పొందిన 36మంది విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ హార్టికల్చర్ అధికారి చక్రపాణి, విజ్ఞానజ్యోతి ప్రతినిధులు అచ్చుతరాంప్రసాద్, శేషగిరిరావ్, దుర్గాప్రసాద్, హరిశ్చంద్రప్రసాద్, వెంకటరావ్, డైరెక్టర్ అర్జునరావ్, జగదీష్, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బంపర్ ఆఫర్

ఆరునెలల వ్యవసాయ శిక్షణ పూర్తిచేసుకున్న విద్యార్థులకు సురేష్‌బాబు బంపర్ ఆఫర్ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ..వరంగల్ జిల్లా రాయపర్తిలో తనకు ఉన్న 30 ఎకరాల భూమిలో పంటలు సాగుచేసి లాభాలు తీసుకోవాలన్నారు. తన భూమిలో పంట సాగు చేసేందుకు ట్రాక్టర్‌తో పాటు పెట్టుబడి మొత్తం తానే పెడతానని లాభాలు మాత్రం మీరే తీసుకోవాలని చెప్పారు. నాతోపాటు వ్యవసాయ అధికారులు, విజ్ఞాన జ్యోతి అధ్యాపకులు అండగా ఉంటారని చెప్పారు.

కాంగ్రెస్ రైతుల ప్రభుత్వం

మెదక్ కలెక్టరేట్: కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వం చేపట్టిన రైతు రుణమాఫీ రెండో విడత కార్యక్రమాన్ని మంగళవారం చేపట్టింది. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా రైతులు టపాసులు కాల్చి, స్వీట్లు పంచి పెట్టి సంబురాలు జరుపుకున్నారు.



కౌడిపల్లి(నర్సాపూర్): హైదరాబాద్‌లో రైతు రుణమాఫి పంపిణీలో ఉన్న కోమ్మి



మనోహరాబాద్(తూప్రాన్): సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగాన్ని వీక్షిస్తున్న రైతులు



వెల్దుర్తి(తూప్రాన్): రుణమాఫీ నిధుల విడుదల ప్రకటన వీక్షిస్తున్న రైతులు

సంక్షిప్త వార్తలు

◆ సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

నిజాంపేట(మెదక్): మండలంలోని చల్మెడ గ్రామానికి చెందిన పలువురికి ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి మంగళవారం తన క్యాంప్ కార్యాలయంలో సీఎం ఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నర్సింహారెడ్డి, ఉప సర్పంచ్ రమేశ్, పాల్గొన్నారు.

◆ అన్నదానం

నర్సాపూర్: పట్టణంలోని లయన్స్‌క్లబ్ ఆఫ్ నర్సాపూర్ స్నేహబంధు ఆధ్వర్యంలో మంగళవారం అన్నదానం చేశారు. లయన్స్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ డాక్టర్ బాబురావు పుట్టిన రోజును పురస్కరించుకొని లయన్స్‌క్లబ్ ప్రతినిధులు జైపాల్, శ్రీకాంత్, మాణిక్యం, వైకుంఠం, అశోక్, రాములు, చక్రపాణి తదితరులు అన్నదానం చేశారు.

◆ వంద కోట్లు కేటాయించాలి

చేగుంట(తూప్రాన్): బ్రాహ్మణ పరిషత్‌కు ప్రభుత్వం వంద కోట్లు కేటాయించాలని తెలంగాణ బ్రాహ్మణ సేవ సంఘం సమాఖ్య సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌శర్మ పేర్కొన్నారు. మంగళవారం ఆయన చేగుంటలో మాట్లాడుతూ.. ప్రస్తుతం ప్రభుత్వం రూ.50 కోట్లు కేటాయించిందని తెలిపారు. ప్రభుత్వం బ్రాహ్మణ పరిషత్‌కు వంద కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు.

◆ జీడిపల్లిలో చోరీ

మనోహరాబాద్(తూప్రాన్): ఇంటిలోంచి బంగారం చోరీ చేసిన సంఘటన మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. మంగళవారం ఎస్ఐ సుభాష్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని జీడిపల్లి గ్రామానికి చెందిన బోల్ల బోయిన శేఖర్ సోమవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో దొంగలు బీరువాలోని తులం బంగారు చైన్, రెండు తులాల గొలుసుతో పాటు కొంత నగదు పోయినట్లు గుర్తించారు. దీంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

◆ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బదిలీ

చిన్నశంకరంపేట(మెదక్): చిన్నశంకరంపేట సెక్టార్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శివకుమారి బదిలీ అయ్యారు. మంగళవారం అంగన్‌వాడీ టీచర్లు ఆమెను సన్మానించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు నాగరాణి, మాలతి, జ్యోతి, రేణుక, నాగమణి పాల్గొన్నారు.

◆ పాఠశాలలో వైద్య శిబిరం

రామాయంపేట(మెదక్): పట్టణంలోని దళితవాడలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో మంగళవారం వైద్యశాఖ జిల్లా మొబైల్ టీం డాక్టర్లు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్లు సిద్ధరాంలు, డాక్టర్ సంతోషి విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. హెచ్ఎం రవీందర్‌గౌడ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. 30 ఎండికె 47–

◆ చికిత్స పొందుతూ యువకుడి మృతి

పెద్దశంకరంపేట(మెదక్): చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. పెద్దశంకరంపేటలోని ప్రియాంక కాలనీకి చెందిన వడ్ల విజయ్‌కుమార్(32)కి మూడు రోజుల క్రితం రోడ్డు ప్రమాదం జరగగా.. తలకు తీవ్రగాయాలయ్యాయి. అతడిని హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. మంగళవారం ఉదయం మృతిచెందాడు. అతడికి భార్య, 11 నెలల కుమార్తె ఉన్నారు.

◆ నిజాంపేట బీజేపీ మండల ఉపాధ్యక్షుడిగా సిద్ధరాంరెడ్డి

నిజాంపేట(మెదక్): మండలానికి బీజేపీ మండల ఉపాధ్యక్షుడు, కిసాన్ మోర్చా అధ్యక్షులను మంగళవారం మండలాధ్యక్షుడు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పప్పుల బీజేపీ మండల ఉపాధ్యక్షులుగా సిద్ధరాంరెడ్డిని, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ సమక్షంలో కిసాన్ మోర్చా మండలాధ్యక్షుడిగా బాబు నియమించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి మహంకాళి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

◆ టై, బెల్టులు పంపిణీ

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని చందంపేట ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు 1998–99 బ్యాచ్ ఎస్సెస్సీ పూర్వ విద్యార్థులు టై, బెల్టులు అందించారు. పాఠశాల హెచ్ఎం శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు శివప్రసాద్‌లు పూర్వ విద్యార్థులను అభినందించారు.

◆ ప్రతి విద్యార్థిపై దృష్టి సారించాలి

మనోహరాబాద్(తూప్రాన్): ప్రతీ విద్యార్థిపై దృష్టి సారించాలని కాళ్లకల్ స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం నర్సింగం అన్నారు. మంగళవారం మండలంలోని కాళ్లకల్, కొండాపూర్, ముప్పిరెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల పఠన స్థాయిని పరిశీలించారు.